క్లుప్తంగా

దేవన్‌రెడ్డికి అభినందన



తిప్పల దేవన్‌రెడ్డిని సన్మానిస్తున్న 68వ వార్డు వైఎస్సార్ సీపీ నాయకులు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదివారం గాజువాక వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త తిప్పలదేవన్‌రెడ్డిని కలిసి అభినందించారు. దేవన్‌రెడ్డితో వార్డు లో పార్టీ పరిస్థితిపై చర్చించారు. కార్యక్రమంలో వార్డు వైఎస్సార్ సీపీ నాయకులు సయ్యద్ హుస్సేన్, నేలపాటి శ్యాంబాబు, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వినియోగిస్తే అనర్థాలు



అవగాహన ర్యాలీ చేస్తున్న తిరుమలనగర్ వాసులు

కూర్మన్నపాలెం: ప్లాస్టిక్ వాడకం వల్ల ఎదురయ్యే అనర్థాలపై తిరుమల నగర్‌లో ఆదివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చిరు వ్యాపారులు, కూరగాయల వర్తకులకు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే పర్యావరణం దెబ్బతింటుందని వివరించారు. గుడ్డ సంచులు వాడాలని సూచించారు. వడ్లపూడి చేపల బజార్లో కూడా అక్కడి వ్యాపారులకు ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించాలని సూచించారు. కార్యక్రమంలో తిరుమల నగర్ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి ఎం.పరమానందం, సంఘం ప్రతినిధులు రామరాజు, వంసతరెడ్డి, సన్యాసిరావు, విశ్వేశ్వరరావు, నాగభూషణం, ఆనంద్‌కుమార్ పాల్గొన్నారు.

బాలవినాయక ఆలయంలో విశేష పూజలు



బాలవినాయక స్వామికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

అక్కిరెడ్డిపాలెం: బిల్ సిగ్నల్ పాయింట్ వద్ద గల ప్రసన్నగిరిపై కొలువైన శ్రీ బాల వినాయక స్వామి ఆలయంలో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. సంకట హర చతుర్థి, హస్తా నక్షత్రం సందర్భంగా స్వామికి దోసకాయ, గరికతో విశేష పూజలు చేశారు. ఆలయ అర్చకులు లక్ష్మీనారాయణ మూర్తి, చరణ్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.

ఘనంగా శ్రీకృష్ణదేవరాయల జయంతి



దేవరాయల విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

గాజువాక: శ్రీకృష్ణ దేవరాయలు జయంతిని స్థానిక శ్రీకృష్ణదేవరాయ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్గు జంక్షన్‌లోని దేవరాయల విగ్రహానికి సంఘం నాయకులు నివాళులర్పించారు. అనంతరం సంఘం ఉపాధ్యక్షుడు కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు మాట్లాడుతూ దేవరాయలు విజయనగర సామ్రాజ్యంలో ప్రజలకు సువర్ణ పాలన అందించారన్నారు. రానున్న ఎన్నికల్లో కాపులందరూ ఐక్యంగా ఉండాలని, శ్రీకృష్ణ దేవరాయల వారసులుగా అదే ఆయనకిచ్చే ఘనమైన నివాళి అని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు గుడివాడ అమ్మన్న, గుడివాడ అప్పలరామ్మూర్తి, విందుల వెంకట రమణ, కాతా బాలకృష్ణ, ఇందల ఈశ్వరరావు, శంకరరావు, ఈశ్వరరావు, మహలక్ష్మినాయుడు, బాలు నాయుడు, రౌతు గోవింద్, సంగ్రాన నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎర్నిమాంబకు ప్రత్యేక పూజలు

కంచరపాలెం: కాన్వెంటు కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఈవో డీఈఎస్ సురేష్‌బాబా నేతృత్వంలో ఆలయ పూజారి వాసుపల్లి విజయమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అర్చకులు పులఖండం శ్రీకాంత్ శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు ప్రత్యేక ఉచిత దర్శనాలతో పాటు రూ.10, రూ.50 కౌంటర్లు ఏర్పాటు చేశారు.

ఎన్నాళ్లీ నరకం!

ఆ మార్గంలో నిత్యం వేలాది మంది రాకపోకలు సాగిస్తున్నారు. దువ్వాడ రైల్వేస్టేషన్, పరిసర గ్రామాలకు ఏకైక మార్గం కావడంతో నరక రహదారే గత్యంతరం. ఏళ్ల కిందట నిర్మించిన బీటీ రోడ్డు వర్షాలకు కొట్టుకుపోయింది. దీంతో అడుగడుగునా గుంతలు.. రాళ్లు తేలిపోయింది. భారీ వాహనాలు వెళితే దుమ్ము రేగి వాహన చోదకుల కళ్లల్లో పడడంతో వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నారు. రెండున్నర కిలోమీటర్ల ప్రయాణానికి నరకం చూస్తున్నారు. అయినా పాలకులు, అధికారుల్లో చలనం లేకపోవడంపై ప్రజలు మండిపడుతున్నారు. - అగనంపూడి

- దువ్వాడ రైల్వేస్టేషన్ ఎస్టీబీఎల్ అనుసంధాన రోడ్డు ధ్వంసం
- అడుగడుగునా గుంతలు
- వాహనదారుల ఒళ్లు హూనం
- ఫట్లు చేస్తూ... పాట్లు పడుతూ రాకపోకలు
- పట్టనట్టు వ్యవహరిస్తున్న పాలకులు, జీవీఎంసీ అధికారులు





దువ్వాడ రైల్వేస్టేషన్ పార్కింగ్ షెడ్ మలుపు వద్ద రహదారి దుస్థితి



మలుపు వద్ద రహదారి దుస్థితి

దువ్వాడ రైల్వేస్టేషన్ ఫ్లైఓవర్ కింద నుంచి వీఎస్ఈజెడ్ గోడను ఆనుకొని నాలుగో ప్లాట్‌ఫారానికి అనుసంధానంగా ఉన్న మార్గం పూర్తిగా ధ్వంసమైంది. దీంతో నిత్యం వేలాది మంది ఇబ్బందులు పడుతూ రాకపోకలు సాగిస్తున్నారు. బీటీ రోడ్డు నామరూపాల్లేకుండా పోయింది. రోడ్డుకిరువైపులా డ్రైనేజీలు లేకపోవడంతో వర్షాల ధాటికి రోడ్డుపై బ్లాక్‌మెటల్‌తోపాటు వేసిన రెండు లేయర్లు పైకి తేలిపోయాయి. అడుగడుగునా గోతులుగా మారిపోయింది.

పదుల గ్రామాలకు ఈ మార్గమే దిక్కు

ఎస్టీబీఎల్, కాపుజగ్గరాజుపేట, వీఎస్ఈజెడ్ బొటగేట్ల మీదుగా షీలానగర్, గోపాలపట్నంకు సమీపం మార్గం కావడంతో దువ్వాడ, కూర్మన్నపాలెం, రాజీవ్‌నగర్, అగనంపూడి, సబ్బవరం శివారు గ్రామాల నుంచి నిత్యం వేలాది మంది ప్రజలు, విద్యార్థులు రాకపోకలు సాగిస్తారు. అలాగే గాజువాక, కూర్మన్నపాలెం, దువ్వాడ, అగనంపూడి, లంకెలపాలెం, సబ్బవరం ప్రాంతాల నుంచి విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలకు వచ్చే వేలాది మంది విద్యార్థులకు ఇదే మార్గమే శరణ్యం. గతంలో ఫకీర్‌తక్యా మీదుగా జగ్గరాజుపేటకు రైల్వే అండర్‌పాత్ వంతెన ఉండేది. రెండు రైల్వే ట్రాక్‌లకు రెండు అండర్‌పాత్ వంతెనలు నిర్మించడంతో భారీ వాహనాల రాకపోకలకు అవకాశం లేకుండా చేశారు. దీంతో ప్రస్తుతం ఈ రోడ్డే భారీ వాహనాలకు శరణ్యం. వీటితో పాటు విజ్ఞాన్ కళాశాలకు చెందిన వందలాది బస్సులు, ప్రైవేటు పాఠశాలల బస్సులు తప్పనిసరి పరిస్థితిలో వచ్చిపోతున్నాయి.

చినుకు పడితే వణుకే

గుంతల వల్ల ఏమాత్రం వర్షం కురిసినా ద్విచక్ర వాహనదారులకు వణుకే. దువ్వాడ రైల్వేస్టేషన్ మొదలుకొని, ఫ్లైఓవర్ వంతెన కింది భాగం, హైటర్‌లైన్ల మలుపు, వీఎస్ఈజెడ్ గోడను ఆనుకొని రోడ్డంతా పెద్ద పెద్ద గోతులతో నిండిపోయింది. వర్షా కాలం అయితే ద్విచక్రవాహనాలు వెళ్లడానికి అవకాశం ఉండడం లేదని వాహనచోదకులు, ప్రయాణికులు ఆవేదన చెందుతున్నారు. ప్రస్తుతం దువ్వాడ రైల్వేస్టేషన్ నుంచి గోపాలపట్నం వరకు లైన్ల నిర్మాణం జరుగుతుంది. ఈ నిర్మాణానికి అవసమైన మెటీరియల్ ట్రాన్స్‌పోర్టు కోసం అయినా రైల్వే అధికారులు చొరవ తీసుకొని రహదారిని పునర్నిర్మాణం చేయాలని స్థానికులు, వాహన దారులు కోరుతున్నారు.

పాలకులకు పట్టదా?



రహదారులన్నీ మరమ్మతులు చేస్తామని పలు మార్లు హామీలిచ్చిన పాలకులు ఈ రహదారి దుస్థితిపై స్పందించరా. రోడ్డు అధ్వానంగా ఉండడం వల్ల ఫీట్లు చేస్తున్నా స్థానిక ఎమ్మెల్యే, కార్పొరేటర్లు పట్టించుకోపోవడం తగదు. ఓపక్క రైల్వే స్థలం,మరోపక్క దువ్వాడ వీఎస్ఈజెడ్ గోడలు ఉన్నాయి. మధ్యలో ఉన్న రోడ్డు గురించి ఎవరికీ పట్టకపోవడం శోచనీయం. తక్షణం స్పందించి రహదారి పునర్నిర్మాణం చేపట్టాలి.
- మచ్చా రామకష్ణ, కాపు జగ్గరాజుపేట

ఒళ్లు హూనం



నిత్యం వేలాది మంది ప్రయాణికులు రాపోకలు సాగించే ఈ మార్గం గురించి పాలకులు పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. వాహనాల మీద వెళ్తుంటే ఒళ్లు హూనం అవుతోంది. నూతుల్లాంటి గోతులతో నిత్యం రాకపోకలు సాగించే వారు పాలకులను తిట్టుకుంటూ వెళ్తున్నారు. అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన లేదు. జీవీఎంసీ కమిషనర్, మేయర్, కమిషనర్ కలుగజేసుకొని రహదారికి మోక్షం కలిగించాలి.
- మహేష్, ఎస్టీబీఎల్

నిర్లక్ష్యం ఎందుకు ?



నిత్యం వేలాది మందికి ఉపయోగపడే రెండున్నర కిలోమీటర్ల రోడ్డు విషయంలో అధికారులు, పాలకులు ఎందుకు నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నారో అర్థం కావడం లేదు. ఈ ప్రభుత్వం రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యతనిస్తుందని చెప్పుకుంటున్నారు. మరి ఇలాంటి రోడ్డు విషయంలో ఎందుకు స్పందించడం లేదో తెలియడం లేదు.
నమ్మి ప్రసాద్, జగ్గరాజుపేట



ఫ్లైఓవర్ కింద భాగంలో రోడ్డు ఇలా..

కష్టపడే కార్యకర్తలకు గుర్తింపు

వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి



పెంటయ్యను అభినందిస్తున్న దేవన్‌రెడ్డి

పెదగంట్యాడ: పార్టీ కోసం పనిచేసే కార్యకర్తలకు ఎల్లవేళలా గుర్తింపు ఉంటుందని వైఎస్సార్ సీపీ గాజువాక సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి భరోసా ఇచ్చారు. పార్టీకి పూర్వ వైభవం తీసుకురావడానికి శక్తికి మించి కృషి చేయాలని ఆయన కార్యకర్తలకు పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా కో ఆపరేటివ్ కార్యదర్శిగా నియమితులైన పల్లేటి పెంటయ్యను 64వ వార్డు గంగవరంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో దేవన్‌రెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్యకారులకు ఏ పార్టీ ఇవ్వని గుర్తింపు వైఎస్సార్ సీపీ ఇచ్చిందని పేర్కొన్నారు. ఇందుకు పెంటయ్యకు జిల్లా స్థాయి పదవి కట్టబెట్టడమే నిదర్శనమన్నారు. కార్యక్రమంలో వార్డు వైఎస్సార్ సీపీ నాయకులు అమ్మోరు, పైడిరాజు, పి జగన్, చిట్టిబాబు, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల నైపుణ్యాభివృద్ధికి కృషి

ఉక్కు ఎల్‌డీసీ విభాగాధిపతి ఠాగూర్



ఎల్‌డీసీ నూతన విభాగాధిపతి ఠాగూర్‌ను సత్కరిస్తున్న నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లోని ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల నైపుణ్యాభివృద్ధికి తన వంతు కృషి చేస్తామని స్టీల్‌ప్లాంట్ లెర్నింగ్ అండ్ డెవలప్‌మెంట్ సెంటర్ (ఎల్‌డీసీ) నూతన విభాగాధిపతి టి.కె.ఎస్.ఆర్ ఠాగూర్ అన్నారు. ఎల్‌డీసీ విభాగాధిపతిగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు ఆదివారం ఠాగూర్‌ను కలిసి గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్‌ఆర్‌డీ ద్వారా అనేక స్కిల్ డెవలప్‌మెంట్ ప్రొగ్రాం ద్వారా పలు కోర్సుల్లో శిక్షణ ఇచ్చి వారి నైపుణ్యాన్ని పెంపొందించడానికి శాయశక్తులా కృషి చేస్తున్నామన్నారు. అసోసియేషన్ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు బి. తాడన్న, బయ్యే మల్లయ్య మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల కోసం హెచ్‌ఆర్‌డీ ద్వారా ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్. సత్యనారాయణ, కోశాధికారి కె.వి. రత్నం, పుల్లారావు, మోహన్‌బాబు, సాయిప్రసాద్, టర్కీ, గణేష్, రామన్న, భీమరాజు తదితరులు పాల్గొన్నారు.

రక్షణగోడ నిర్మాణ పనులపై నిర్లక్ష్యమేల?



సగంలో నిలిచిన రక్షణ గోడ నిర్మాణం



తుప్పలతో దర్శనమిస్తున్న ప్రధాన కాలువ

కూర్మన్నపాలెం: కాలువపై రక్షణగోడ నిర్మాణం అర్ధంతరంగా నిలిపివేశారు. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని పరిసర ప్రాంతాల ప్రజలు బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారు. గాజువాక జోన్ పరిధిలోని 87వవార్డు ముస్లిం వీధి నుంచి చాకలిపేట మీదుగా జాతీయ రహదారి వైపు అతిపెద్ద కాలువ నిత్యం ప్రవహిస్తోంది. ఎగువన ఉన్న అనేక కాలనీల నుంచి మురుగునీరు, వర్షపు నీరు చిన్న చిన్న డ్రైన్ల ద్వారా వచ్చి ప్రధాన కాలువలో చేరుతోంది.

ఆనీరంతా ఆయా వీధుల పక్క నుంచి తరలివెళ్లి సముద్రంలో కలిసిపోతుంది. ఈ కాలువ పొంగి దిగువన ఉన్న నివాసాలపైకి చేరేది. ఆ సమస్యను అధికారులతో పాటు నాటి ఎమ్మెల్యే తిప్పలనాగిరెడ్డి దృష్టికి ప్రజలు తీసుకువెళ్లారు. దీంతో నాగిరెడ్డి చొరవ చూపి జీవీఎంసీ అధికారులతో చర్చించి కాలువకు ఇరువైపులా రక్షణ గోడ నిర్మించేందుకు రూ.40 లక్షలు మంజూరు చేయించారు. దీనిలోని భాగంగా పనులు ప్రారంభించి ముస్లిం వీధి నుంచి కొంత భాగం గోడ నిర్మించారు. కొత్త ప్రభుత్వం వచ్చిన తర్వాత అక్కడి పనులు అర్ధంతరంగా నిలిపివేశారు. దీంతో మిగిలిన కాలువ ప్రాంతమంతా తుప్పలతో నిండిపోయింది. ఇరువైపులా మట్టి కరిగిపోయి ప్రవాహానికి అడ్డంకిగా మారుతోంది. చెత్తా చెదారం పేరుకుపోవడంతో ముక్కు పుటాలు అదిరిపోయే దుర్వాసన వెదజల్లుతుంది. ఆ వాసన భరించలేక ప్రజలు అల్లాడిపోతున్నారు. అంతే కాకుండా గెడ్డను ఆనుకొని నివసిస్తున్నవారు తమ ఇంటి గోడలు ఏ క్షణాన కూలిపోతాయేనని భయంతో బెంబే లెత్తిపోతున్నారు. పాలకులు,ఉన్నతాధికారులు స్పందించి సగంలో నిలిచిపోయిన రక్షణగోడ నిర్మాణ పనులు పూర్తి చేయాలని ముస్లింవీధి,చాకలిపేట వాసులు కోరుతున్నారు.

ఘనంగా వెంకయ్యమ్మ పరస



పరసలో సందడి చేస్తున్న చిన్నారులు

పెదగంట్యాడ: జీవీఎంసీ 75వ వార్డు పరిధిలోని పెదగంట్యాడలో ఆదివారం గంట్యాడ వెంకయ్యమ్మ పరసను ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు గంట్యాడ గోవిందరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ప్రజలు సందడి చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఎస్సీ కాంప్లెక్స్ వద్ద ఏర్పాటు చేసిన డ్యాన్స్ బేబీ డ్యాన్స్ ఉర్రూతలూగించింది. అలాగే పెదగంట్యాడలోని రేలారే రేలా కార్యక్రమం ఆకట్టుకుంది. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం కార్యవర్గ ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేస్తున్న సంఘ నూతన కార్యవర్గం

గాజువాక: విశాఖపట్నం జిల్లా (రూరల్) ఆర్యవైశ్య సంఘ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా బెల్లాల పెంటబాబు, కార్యదర్శిగా గునిశెట్టి అప్పల సత్యనారాయణ, కోశాధికారిగా కట్టా సత్యానందం, యువజన సంఘం అధ్యక్షుడిగా కందుల సాయి సత్యనారాయణ, కార్యదర్శిగా రెంటాల సుధాకర్, కోశాధికారిగా కోట్ల గుప్తతోపాటు మహిళా సంఘం, సేవాదళ్ తదితర కమిటీల సభ్యులు ప్రమాణం చేశారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు చిన్ని రామ సత్యనారాయణ, కర్నూల్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. వారు మాట్లాడుతూ ఆర్యవైశ్యుల సంక్షేమానికి, అభివృద్ధికి కమిటీ కృషి చేయాలన్నారు. రాజకీయంగా ఎదిగేందుకు ఆర్యవైశ్యులు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు కారుమూరు మహేష్, పి.పి.ఎస్.నాగేశ్వరరావు, గుంపిన రఘునాథగుప్త తదితరులు పాల్గొన్నారు.

హమ్మయ్య.. కొమ్మలు తొలగించారు

సాక్షి ఎఫెక్ట్..

కూర్మన్నపాలెం: వడ్లపూడి ప్రధాన రహదారిపై విద్యుత్ వెలుగులకు అడ్డుగా నిలిచిన చెట్ల కొమ్మలను తొలగించారు. లైట్లు ఉన్నా అంధకారం అన్న శీర్షికన ఈ నెల 9వ తేదీన 'సాక్షి'లో వెలువడిన కథనానికి అధికారులు స్పందించారు. దీనిలో భాగంగా జాతీయ రహదారి నుంచి గాంధీ బొమ్మ సెంటర్ వరకు డివైడర్‌లో ఉన్న చెట్ల కొమ్మలను, పొదలు ఆదివారం తొలగించారు. జీవీఎంసీ అధికారుల పర్యవేక్షణలో సిబ్బంది వాటిని తొలగించి విద్యుత్ వెలుగులు రోడ్డుపై పడేలా చర్యల తీసుకున్నారు. దీంతో వడ్లపూడి పరిసర వాసులు, వాహన చోదకులు హర్షం వ్యక్తం చేశారు.



కొమ్మలు తొలగించిన దృశ్యం

బాల్యం నుంచి భద్రతపై అవగాహన అవశ్యం



ప్రసంగిస్తున్న వర్క్స్ సీజీఎం మొహంతి

ఉక్కునగరం: చిన్న వయసు నుంచే విద్యార్థులకు భద్రతపై అవగాహన కల్పించడం అవశ్యమని.. తద్వారా బాధ్యత కలిగిన పౌరులుగా తీర్చిదిద్దగలమని స్టీల్‌ప్లాంట్ సీజీఎం (వర్క్స్) రంజన్ మొహంతి అన్నారు. జాతీయ భద్రతా దినోత్సవ వేడుకల సందర్భంగా ఆదివారం ఉక్కు మల్టీపర్పస్ హాలులో విద్యార్థులకు వ్యాసరచన, నాటిక పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికసిత భారత్ 2047 లక్ష్యసాధనలో భద్రత కీలక పాత్ర పోషిస్తుందన్నారు. పోటీల్లో ఉక్కునగరం, పెదగంట్యాడ ప్రాంతాలకు చెందిన సుమారు 500 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ సీజీఎం ప్రవీణ్‌కుమార్, జీఎంలు యు.ఎన్. బెహరా, భద్రతా విభాగాధిపతి ఎం.ఎస్.ఎన్. రాజు, డీజీఎం వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చికెన్ షాపులు వెలవెల

- బర్డ్ ఫ్లూ కలకలంతో తగ్గిన అమ్మకాలు
- ఆందోళన చెందుతున్న వ్యాపారులు

పెదగంట్యాడ: రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో బర్డ్‌ఫ్లూ వ్యాప్తిచెందడంతో దాని ప్రభావం ఇక్కడ కూడా పడింది. బర్డ్‌ఫ్లూ వ్యాపిస్తుందనే ప్రచారంతో చికెన్, కోడిగుడ్లు తినేందుకు ప్రజలు హడలిపోతున్నారు. కొద్ది రోజులు ఈ రెండింటికి దూరంగా ఉంటే మంచిదని కొనుగోలుకు ఆసక్తి చూపడం లేదు. చికెన్ దుకాణాలు వినియోగదారులు లేక వెలవెలబోతున్నాయి. దీంతో వ్యాపారస్తులు ఏమీ తోచని స్థితిలో ఉన్నారు. మరోవైపు కిరాణా దుకాణాల్లో గుడ్లు సైతం కొనుగోలు చేసే వారి సంఖ్య తగ్గిపోయింది. పెదగంట్యాడ మండలం పరిధిలోని వివిధ గ్రామాల్లో చికెన్ సెంటర్లు బోసిపోయి కనిపిస్తున్నాయి. ప్రధానంగా నడుపూరు, నెల్లిముక్కు ప్రాంతాల్లో బోనిలేదని వ్యాపారుల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రభావం రాష్ట్ర వ్యాప్తంగా కొద్దిరోజులు పాటు ఉంటుందనే అభిప్రాయం అనేక మంది వ్యక్తం చేస్తున్నారు.

పడిపోయిన చికెన్ ధరలు

వారం కిందట వరకూ కిలో చికెన్ ధర రూ. 230 నుంచి 240 వరకూ ఉండేది. ప్రస్తుతం ధర కిలో రూ .180కి పడిపోయింది. అయినా కొనేందుకు కొనుగోలుదారులు ముందుకు రావడం లేదని వ్యాపారస్తులు ఆవేదన చెందుతున్నారు.

మటన్, చేపలకు డిమాండ్

బర్డ్‌ఫ్లూ భయంతో మాంసాహారులు చికెన్ కొనేందుకు వెనకడుగు వేస్తున్నారు. దీంతో చేపలు, రొయ్యలు, మటన్‌కు డిమాండ్ పెరిగింది. ఆదివారం ఆయా దుకాణాలు కిటకిటలాడాయి. పెదగంట్యాడ, నెల్లిముక్కు, మదీనాబాగ్ చేపల దుకాణాల వద్ద ఆదివారం విపరీతమైన రద్దీ కనిపించింది. దీన్ని ఆసరాగా తీసుకుని వ్యాపారులు ఒక్కసారిగా వాటి రేట్లు పెంచేశారు.



వెలవెలబోతున్న చికెన్ దుకాణం



పెదగంట్యాడ చేపల మార్కెట్

1600 కిలోల పీడీఎస్ బియ్యం పట్టివేత



సీజ్ చేసిన రేషన్ బియ్యంతో వాహనం

పెదగంట్యాడ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదలకు ఉచితంగా ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా అందించే బియ్యం నల్ల బజారుకు తరలి పోతున్నాయి. ఇదే క్రమంలో పీడీఎస్ బియ్యాన్ని తరలించడానికి వ్యాపారులు సిద్ధమవగా పక్కా సమాచారంతో న్యూపోర్టు పోలీస్ స్టేషన్ సీఐ కామేశ్వరరావు ఆదేశాల మేరకు సిబ్బంది దాడి చేసి బ్రేక్ వేశారు. పెదగంట్యాడ గొడ్డువానిపాలెంలో అంకల నారాయణ ఇంటి వద్ద అక్రమంగా వ్యాన్‌లో నిల్వచేసి తరలించడానికి సిద్ధంగా ఉంచిన 1600 కిలోల బియ్యాన్ని ఆదివారం ఎస్ఐ శ్యామ్ సిబ్బందితో కలసి పట్టుకున్నారు. బియ్యంతో పాటు వాహనాన్ని సీజ్ చేసి సంబంధిత వ్యక్తి పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.